ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
గురువారం 10 మార్చి 2025
www.prajaaswaramdaily.com
2 pm

హైదరాబాద్ పాతబస్తీలో దారుణం

అక్క, అన్న పై తమ్ముడి దాడి

ఒకరి మృతి

కుటుంబ కలహాల నేపథ్యంలో ఘాతుకం

హైదరాబాద్ : హైదరాబాద్ పాతబస్తీ చాదర్ ఘాట్ లో దారుణం వెలుగుచూసింది. అక్క, అన్న పై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు ఓ తమ్ముడు. ఈ దాడిలో సోదరుడికి తీవ్ర గాయాలు కాగా అక్క లక్ష్మిని సోదరుడు మదన్ బాబు కత్తితో దాడిచేసి చంపేశాడు. గాయపడిన సోదరుడిని ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ దారుణానికి పాల్పడ్డట్టు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పవన్ కల్యాణ్ సీరియస్ పొలిటీషియన్ కాదు



ఆయన ఉపముఖ్యమంత్రి కావడం ఏపీ ప్రజల దురదృష్టం

వైసీపీ తప్ప అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నారు : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ : పవన్ నిజానికి సీరియస్ పొలిటీషియన్ కాదని, ఆయన వ్యాఖ్యలను అంతగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. దురదృష్టవశాత్తూ ఆయన ఏపీకి ఉపముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. ఏపీలో వైసీపీతో మినహా అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. ఈ మేరకు ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కవిత ఈ వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ప్రజలు హిందీ నేర్చుకోవాలన్న పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఎలా స్పందిస్తారని అడిగిన ప్రశ్నకు ఈ వ్యాఖ్యలు చేశారు.

రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్లలో పూర్తిగా వామపక్ష భావజాలంతో కనిపించిన పవన్ కల్యాణ్.. ప్రస్తుతం బీజేపీతో అంటకాగుతున్నారని విమర్శించారు. పార్టీ పెట్టిన 15 ఏళ్లకు ఎమ్మెల్యేగా ఎన్నికై అనుకోకుండా ఉపముఖ్యమంత్రి అయ్యారని, అది ఏపీ ప్రజల దురదృష్టమని అన్నారు. చెగువేరాను ఆదర్శంగా తీసుకున్నట్లు ప్రకటించిన పవన్ ప్రారంభంలో సీపీఐ, సీపీఎంతో పొత్తు పెట్టుకున్నారని గుర్తు చేశారు. ఆ తర్వాత లెఫ్ట్ భావజాలం విడిచి హిందుత్వం వైపు మొగ్గు చూపారని, బీజేపీతో పొత్తు పెట్టుకున్నాక ఆయన ప్రవర్తనలో మార్పు వచ్చిందని అన్నారు. హిందుత్వం మీద ఆయనకు ఇప్పుడు అతిభక్తి పెరిగిపోయిందని పేర్కొన్నారు. ఆయన చేసే ప్రకటనల్లో ఒకదానికొకటి పొంతన ఉండదని ఎద్దేవా చేశారు. రేపు తమిళనాడుకు వెళ్లి హిందీ ఇంపోజ్ చేయబోమని చెప్పినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదని ఎమ్మెల్సీ కవిత చెప్పారు.

బీహెచ్ఈఎల్‌లో క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

ఓ ఇంటిపై మాదాపూర్ ఎస్ఓటీ బృందం దాడి

ఇద్దరి అరెస్టు .. పరారీలో మరొకరు

హైదరాబాద్: ఈజీ మనీ సంపాదించేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. ఈ క్రమంలో పోలీసులకు చిక్కి కటకటాల పాలవుతున్నారు. ఆ మేరకు ఎస్ ఓటీ బృందం దాడుల్లో బీహెచ్ఈఎల్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠా గుట్టు రట్టయ్యింది. గుట్టుచప్పుడు కాకుండా బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఓ ఇంటిపై దాడి చేసింది. పఠాన్ చెరువుకు చెందిన చిరంజీవి, కృష్ణ లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఆరు ఖాతాల ద్వారా బెట్టింగ్ లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అందులో ఉన్న రూ. 2.55 లక్షలు ఫ్రీజ్ చేశారు . ఇతర రాష్ట్రాలలో కూడా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.

విశ్వవేదికపై క్రికెట్ సంబురం

ఒలింపిక్స్‌లో క్రికెట్ కు చోటు

లాస్ ఏంజిలెస్ వేదికగా జరుగనున్న పోటీలు

వాషింగ్టన్ : అందరూ హర్షించదగ్గ విషయం. ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌లో క్రికెట్ కు అవకాశం కల్పించారు. 128 ఏళ్ల తర్వాత..128 ఏళ్ల తర్వాత.. చోటు ఇచ్చారు. 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్ భాగం కానుంది. 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నట్లు తాజాగా నిర్వాహకులు ధ్రువీకరించారు. 2028 ఒలింపిక్స్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో 6 జట్లు చొప్పున పాల్గొననున్నాయి. ఒక్కో టీమ్ నుంచి 15 మంది ఆటగాళ్ల చొప్పున.. మొత్తం 90 మంది క్రికెటర్లకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఎగ్జిక్యూటివ్ బోర్డు అనుమతిని ఇచ్చింది. టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్ 5 జట్లు 2028 ఒలింపిక్స్‌లో ఆడే అవకాశాలు ఉన్నాయి. ఆతిథ్య జట్టు అయిన అమెరికాకు డైరెక్ట్ ఎంట్రీ దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం తెలుస్తోంది. 2032లో బ్రిస్బేన్ ఒలింపిక్స్‌లో కూడా క్రికెట్ ఉంటుంది.

అమిత్ షా చిన్ననాటి ముద్దు పేరు ఇదే

ముంబయి : కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన చిన్ననాటి ముద్దుగా ఏ పేరు పెట్టి పిలుస్తారు వెల్లడించారు. ఓ జాతీయ మీడియా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నప్పుడు తనను "పూనమ్" అని పిలిచేవారని చెప్పుకొచ్చారు. ఐదేళ్లు నిండిన తర్వాత పేరు పెట్టాలనుకున్నారన్నారు. శరద్ పూర్ణిమ నాడు పుట్టానని, అందరూ పూనమ్ అని తనను పిలిచేవారని అమిత్ షా చెప్పారు.. గ్రామాల్లో పుట్టిన ప్రతి ఒక్కరికీ ఇది సర్వసాధారణ విషయమేనని తెలిపారు. ఇందులో పెద్ద రహస్యమేమి లేదన్నారు.

బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు మాతృవియోగం

బోధన్: బోధన్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత షకీల్ ఇంట్లో విషాదం చోటుచేసుకున్నది. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న షకీల్ తల్లి కన్నుమూశారు. దవాఖానలో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో మరణించారు. విషయం తెలుసుకున్న పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గురువారం అచన్‌పల్లిలో ఆమె అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు వెల్లడించారు.